క్లుప్తంగా

బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్‌గా కృష్ణ



వేముల కృష్ణ

కాసిపేట: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల కృష్ణను బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్‌గా ఏఐసీసీ ఆదివాసీ అధ్యక్షుడు శివాజీరావు మోగే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ధ్యేయంగా లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా నూతనంగా ఇన్‌చార్జి కో ఆర్డినేటర్‌లను ఏఐసీసీ, రాష్ట్ర అధిష్టానం నియమించినట్లు తెలిపారు. అందులో భాగంగా బోథ్ ఎస్టీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు.

నేటి నుంచి క్రీడా పోటీలు ప్రారంభం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడోత్సవాలను నిర్వహించనుందని ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్న ఆదిలాబాద్ రూరల్ మండలస్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల స్థాయి క్రీడ పోటీలను ఈ నెల 15 నుంచి 17 వరకు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్నామన్నారు. ఈ క్రీడల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ వంటి క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా వాలీబాల్ క్రీడ పోటీలకు 16జట్లు, కబడ్డీకి ఆరు జట్లు, అథ్లెటిక్ క్రీడలకు 18మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రీడల పోటీల ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్య అతిథిగా రానున్నారని వివరించారు. క్రీడాకారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో ఆనంద్, పీఈటీలు నాందేవ్, విఠల్ రెడ్డి, ఆశ్వక్ రెడ్డి ఉన్నారు.

నేడు క్రీడా పోటీలు ప్రారంభం..

తాంసి: భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించడానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.


'దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు'



మాట్లాడుతున్న బెల్లయ్య, పార్వతి

నేరడిగొండ: దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే విషయం కర్ణాటక ఫలితాలతో స్పష్టమైందని అప్పిల్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ పార్వతి అన్నారు. ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను ఆదివారం హైదరాబాద్‌లో కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పునర్ నిర్మాణంలో భాగంగా రాహుల్ గాంధీతో కలిసి కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు భారత్ జోడోయాత్రలో తెలంగాణ రాష్ట్రం నుంచి తనవంతు బాధ్యతగా పాల్గొన్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాస్

నార్నూర్: మాతృదినోత్సవం సందర్భంగా మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన పేద కుటుంబానికి చెందిన జాదవ్ దూద్‌రాం కూతురు వాణిశ్రీ పెళ్లికి రూ.20వేల సాయాన్ని ఆదివారం మండలంలోని ఖంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ చౌహాన్ విజయలక్ష్మి చివరి శ్వాస వరకు ప్రజాసేవకు అంకితమై పని చేసిందన్నారు. ఆమె జ్ఞాపకార్థం మాతృ దినోత్సవం సాయం అందించినట్లు తెలిపారు. ఈ నెల 16న అమ్మాయి వాణిశ్రీ పెళ్లి పెట్టుకున్న ఆ కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందిని ఎదుర్కొంటున్నారని తెలుసుకుని గ్రామస్తుల సమక్షంలో ఆర్థిక సాయాన్ని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వేత రూప్‌దేవ్, గ్రామస్తులు రాథోడ్ రమేశ్, యశ్వంతరరావు నాయక్ ఉన్నారు.

ఆదర్శంగా నిలిచారు

- పదిలో ఆదర్శ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు
- ప్రైవేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య
- ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించిన మోడల్ విద్యార్థులు
- జిల్లాలోని 3 మోడల్ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు



బోథ్: కార్పొరేట్ చదువులకు ధీటుగా పేద విద్యార్థులకు మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతోంది. ప్రణాళికతో ముందుకు సాగుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మోడల్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. పాఠశాలలో మెరుగైన విద్యాబోధన, ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో మోడల్ స్కూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించారు. జిల్లాలో ఆరు మోడల్ స్కూళ్లు ఉండగా అవి బోథ్, బంగారుగూడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, జైనథ్, నార్నూర్‌లో ఉన్నాయి. ఆరు మోడల్ స్కూళ్లలో మొత్తం 569 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 562మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆరు మోడల్ స్కూళ్లలో యావరేజ్‌గా 97.81 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బోథ్ మోడల్ స్కూళ్లో ముగ్గురు విద్యార్థులు 10జీపీఏ సాధించారు. బోథ్, జైనథ్, నార్నూర్‌లలోని మోడల్ స్కూళ్లు వంద శాతం ఫలితాలు సాధించాయి.

ప్రణాళికతో చదివించాం..



మొదటి నుంచే ప్రణాళికబద్ధంగా బోధించాము. సరైన సమయంలో సిలబస్‌ను పూర్తి చేశాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సబ్జెక్టుల వారీగా స్టడీ అవర్స్ నిర్వహించాం. మోటివేషన్ తరగతులను నిర్వహించాం. ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమైంది.

– ఉమేష్‌రావు, ప్రిన్సిపాల్, మోడల్‌స్కూల్, బోథ్

సమయం సద్వినియోగంతో..



సమయాన్ని సరిగ్గా వినియోగించుకున్నాను. సబ్జెక్టుల వారీగా సమయాన్ని కేటాయించి చదివాను. స్టడీ అవర్స్ ఎంతగానో ఉపయోగపడింది. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల పంతో సహకారం అందించారు. 10 జీపీఏ సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రైవేట్‌కు ధీటుగా మోడల్ స్కూల్‌లో విద్యాబోధన జరుగుతోంది. ఇక్కడ చదవడం అదృష్టంగా భావిస్తున్న.

– డి.సౌరభ్, మోడల్ స్కూల్ విద్యార్థి, బోథ్

ఫలితాలు ఇలా..

- బోథ్‌లోని మోడల్ స్కూళ్లో 100మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వంద మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. వంద శాతం ఫలితాలు సాధించి ఉత్తమ విద్యాలయంగా నిలిచింది. తొమ్మిది కన్నా ఎక్కువ జీపీఏ 50 మంది విద్యార్థులు సాధించారు.
- జైనథ్ మండలంలోని మోడల్ స్కూళ్లో 97మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 97 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా జైనథ్ పాఠశాల నిలిచింది. ఈ పాఠశాలలో 36 మంది విద్యార్థులు 9కి పైగా జీపీఏ సాధించారు.
- నార్నూర్ మండలంలో 86మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 86 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలగా ఆదర్శంగా నిలిచింది.
- గుడిహత్నూర్ మండలంలోని మోడల్ స్కూళ్లో 97మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 94మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 95శాతం ఫలితాలను సాధించింది.
- బజార్‌హత్నూర్ మండలంలోని మోడల్ స్కూళ్లో 94మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 91మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 96శాతం ఫలితాలు వచ్చాయి.
- బంగారుగూడ మోడల్ స్కూల్‌లో మొత్తం 95మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 94మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 98.90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలలో 33మంది విద్యార్థులు 9 శాతం కన్నా ఎక్కువ జీపీఏ సాధించారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న

ఆదిలాబాద్‌టౌన్: దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ నెల 29న మాదిగ సంక్షేమ సంఘ భవనం భూమిపూజ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సర్వే నం.72లో సంఘ భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందాల రాజన్న, గాలిపెల్లి నాగన్న, అలాల్ అజయ్, మనోజ్, రాందాస్, ప్రభాకర్, సంజయ్, దయాకర్, నవీన్, ఆడెల్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్

ఇచ్చోడ : ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్‌సంగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఆలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. మండల కేంద్రంలో విఠలేశ్వర మందిరం వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న మండపానికి జెడ్పీ నిధుల నుంచి రూ.10లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రీతంరెడ్డి మాట్లాడుతూ.. ఎంపీపీ నిధుల నుంచి మండప నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైష్ణవ సదన్ పీఠాధిపతి నారయణ్ మహరాజ్ ఉన్నారు.

తాగునీటికి తండ్లాట



ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన చిచ్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్ నగర్‌లో 20గృహాలు ఉండగా అందులో సుమారు 100 మంది వరకు జనాభా ఉన్నారు. వీరి దాహార్తి తీర్చడానికి గ్రామంలో బావి, చేతి పంపు ఉంది. మిషన్ భగీరథ నీరు వారానికి ఓసారి సరఫరా అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా బావి నీరు తాగడానికి ఉపయోగపకరంగా లేకపోవడంతో గ్రామస్తులు చేతి పంపు నీరు తాగుతున్నారు. నాలుగు రోజుల కిందట చేతి పంపు రాడ్ విరిగిపోయింది. ఈ విషయాన్ని సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో చేతి పంపు హ్యాండిల్ లేక పైపు లోపల ఉన్న రాడుతో అతి కష్టంపై నీటిని తోడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు ఆ ఫొటోలను వాట్సప్ గ్రూపులో షేర్ చేశారు. ఈ విషయంపై సాక్షి సర్పంచ్‌ను సంప్రదించగా సోమవారం చేతి పంపుకు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

అన్నదానం

కైలాస్‌నగర్: పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే నిరుపేదలు, అనాథల ఆకలిని తీర్చాలనే ఉద్దేశంతో సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఈ ఆదివారం 112వ వారానికి చేరింది. ప్రతి ఆదివారం ఆదిలాబాద్ పట్టణ పరిసర ప్రాంతాల్లో చేస్తున్న ఈ సేవా కార్యక్రమం ఈ ఆదివారం కూడా కొనసాగింది. ఆదిలాబాద్ ప్రయాణ ప్రాంగణంలో ట్రస్టు సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, పవన్, శేఖర్, లఖన్ తదితరులు పాల్గొన్నారు.

టైఫాయిడ్‌తో యువకుడి మృతి



కోవ లక్ష్మణ్(ఫైల్)

ఇంద్రవెల్లి: టైఫాయిడ్ జ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని డోంగర్‌గామ్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... కోవ అభిమాన్, భుమ్‌బాయి దంపతులకు చెందిన కోవ లక్ష్మణ్(28) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. నాటు వైద్యం చేయించినా ఫలితం కానరాలేదు. వారం రోజులుగా ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వచ్చింది. దీంతో స్థలం మార్చాలనే ఉద్దేశంతో కుటుంబీకులు తమ బంధువులు ఉంటున్నా మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాలేగూడ గ్రామానికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


రెడ్డినాయక్‌కు సన్మానం



రెడ్డినాయక్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: ఆల్ బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జాదవ్ రెడ్డినాయక్‌ను ఆదివారం సంఘం గౌరవ అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ ఆధ్వర్యంలో దొడంద గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీ గిరిజనుల అభివృద్ధికి కృషిచేస్తున్న రెడ్డినాయక్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. లంబాడీ గిరిజనుల సమస్యలతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవ సంఘం జిల్లా నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ఛత్రపతి సంబాజీ జయంతి



నివాళి అర్పిస్తున్న యూత్ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఛత్రపతి సంబాజీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేన యూత్ సభ్యులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం యూత్ సభ్యులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీతో పాటు ఆయన కుమారుడు సంబాజీ మహరాజ్‌లు మరాఠ సామ్రాజ్య స్థాపనకు, అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. యూత్ సభ్యులు సాయికిరణ్, మనోహర్, సాయి, మహేశ్, డిగాంబర్, గణేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

కర్ణాటక ప్రజల తీర్పు దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న జిల్లా నాయకుడు జగన్ సింగ్

ఆదిలాబాద్‌టౌన్: మత రాజకీయాలను తిప్పికొడుతూ కర్ణాటక ప్రజలు దేశానికే ఆదర్శంగా నిలిచారని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు జగన్ సింగ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత విద్వేష, ఫాసిస్టు బీజేపీ పార్టీని ఓడించిన కర్ణాటక ప్రజల తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. గతంలో బీజేపీ ఫిరాయింపులను ప్రోత్సహించి దొడ్డిదారిలో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రధాని మోదీ, అమిత్ షా దుష్ప్రచార రాజకీయాలకు ఈ తీర్పు ప్రజాస్వామికమైందన్నారు. బీజేపీని ఓడించండి అని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా శ్రేణులు కూడా కర్ణాటకలో ప్రచారం చేశారని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

తాంసి: కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబురాలు నిర్వహించుకుంటున్నారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో టపాసులు పేల్చి, నాయకులు, కార్యకర్తలు ఒకరికి ఒకరు మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వన్నెల అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ జనంలో ఆదరణ పెరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ మల్లేష్, నాయకులు అన్ను పటేల్, రమేష్, విజయ్, రామేశ్వర్, సంతోష్, రాజావళి, కిరణ్‌రెడ్డి ఉన్నారు.

గ్రామస్థాయిలో బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేద్దాం



వివరాలు తెలుసుకుంటున్న పూర్ణచందర్ నాయక్

ఇంద్రవెల్లి: గ్రామస్థాయి నుంచి బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతీ క్కరిపై ఉందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు పూర్ణచందర్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పలు గ్రామపంచాయతీల సర్పంచ్‌లతో సమావేశమై గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, తెలంగాణలో అమలవుతున్న పల్లెప్రగతి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, మన ఊరు– మన బడి, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండల అధ్యక్షుడు కినక జుగాదిరావ్, సర్పంచ్‌లు జాదవ్ లఖన్, కుడే కైలాస్, మడావి శేకు, నాయకులు మోహన్‌నాయక్ తదితరులున్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'



బేలలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బేల: కాంగ్రెస్ పార్టీని వీడిన ప్రతిఒక్కరూ వెనక్కి రావాలని, మళ్లీ సొంత గూటికి చేరాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయనకు ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ వేర్వేరు కాదని, ఇద్దరు ఒకటేనని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. పనిచేయని ఎమ్మెల్యేను ఓడించి ఇంట్లో కూర్చోబెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు వాంఖడే వామన్, గుండవార్ సంజయ్, దేవతాళే విఠల్, చంద్రకాంత్, ఎండీ అఖిల్, అవినాష్ పాల్గొన్నారు.

ఘనస్వాగతం..

జైనథ్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన జైనథ్ మండల కేంద్రానికి ర్యాలీగా రావడంతో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆయన బాబా సాహెబ్ అంబేద్కర్, తెలంగాణ తల్లి, చాకలి ఐలమ్మ, హిరాసుఖ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

బేలలో డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న హరిశ్‌రెడ్డి, నాయకులు

బేల: బేలలో డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరిష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేలలో కొనసాగిన డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే చివరి సెమిస్టర్‌లకు కాకతీయ యూనివర్సిటీ అధికారులు అనాలోచిత నిర్ణయంతో తొలగించడం సరికాదన్నారు. ఇక్కడి డిగ్రీ విద్యార్థులు 32 నుంచి 50కిలో మీటర్ల దూరంలోని జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాయాలంటే తీవ్ర ఇబ్బందికరంగా మారనుందని తెలిపారు. 500కు పైబడి విద్యార్థులకు దూరభారంతో పాటు ఆర్థిక భారం, సకాలంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేసారి బేలలో, మరోసారి ఆదిలాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని మార్చుతూ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు స్పందించి పునరాలోచించి డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని బేలలో శాశ్వతంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ సభ్యులు రేసు మనోజ్‌రెడ్డి, ప్రీతం, పవన్ రెడ్డి, గుంజేవార్ మహేష్, సురజ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా..



క్యాప్‌లు అందజేసిన జెడ్పీటీసీ

నేరడిగొండ: క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటామని నేరడిగొండ ఉపసర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నాలుగు రోజులుగా నేరడిగొండ ప్రీమియర్ లీగ్ జరుగుతుండగా క్రీడాకారులు ఎండలో క్రికెట్ ఆడుతున్న విషయాన్ని గమనించి జెడ్పీటీసీ అనిల్ జాదవ్ 120 మంది క్రీడాకారులకు టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా జట్ల కెప్టెన్లు, ఎన్‌సీసీ మెంబర్లు పవన్‌కుమార్, నరేష్, లఖన్, మణిరాజ్, జైవంత్, మురళీ, దినేష్, యోగి, సిద్దు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఎంఐఎం

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఎంఐఎం పార్టీ ఆదివారం వార్డు నం.6లో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి పార్టీ ఆదేశాల మేరకు పర్యటిస్తున్నామని మాజీ కౌన్సిలర్ అశోక్ తెలిపారు.